క్లుప్తంగా

భక్తులకు 24 గంటలూ వైద్య సేవలు



ఆర్టీసీ బస్టాండులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తి అర్బన్: భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలకు పుట్టపర్తికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి మంగళవారం పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, హారతి ఘాట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద , అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోనూ, మామిళ్ల కుంట క్రాస్ వద్ద ఉన్న రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు ఈ నెల 24 వరకూ 24 గంటలూ పని చేస్తాయన్నారు. వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేస్తారన్నారు. అవసరమైతే సీరియస్ కేసులను ఆస్పత్రులకు రెఫర్ చేసి వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోత్స్న, దీప్తి, నారాయణరెడ్డి, కళ్యాణ శృతి, సీహెచ్‌ఓ నగేష్, కార్యకర్త అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న వస్తువులు అప్పగింత



బ్యాగ్‌లోని వస్తువులను కంపెనీ ఉద్యోగికి అప్పగిస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో 15 రోజుల క్రితం పోగొట్టుకున్న వస్తువులను బాధితుడికి అప్పగించారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. పోలీసులు 15 రోజుల క్రితం గస్తీ తిరుగుతుండగా న్యామద్దెల రోడ్డు పక్కన దుకాణం వద్ద ఓ బ్యాగ్ లభించింది. తర్వాత పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పరిశీలించగా అందులో ఒక ల్యాప్‌టాప్,ఒక యాపిల్ మొబైల్, ఒక ఐడీ కార్డు ఉన్నట్లు గుర్తించారు. ఐడీలో ఉన్న ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సూరజ్‌మిశ్రాగా తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని కంపెనీ ఉద్యోగి మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆధారాలు చూపగా ఆయనకు వాటిని అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఓడీచెరువు : కొండకమర్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భానుప్రకాష్, ప్రధానోపాధ్యాయుడు మునేనాయక్, ఉపాధ్యాయుడు భార్గవ్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

తాడిమర్రి: మండలంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం నియోజకవర్గం నాయకులు కుళ్లాయప్ప, మండల వ్యవసాయ కార్యదర్శి లక్ష్మీనారాయణలు అధికారులను కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రైతు సంఘం నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన అధికారులకు వినతిపత్రం అందించారు.

క్రమశిక్షణ అలవరచుకోవాలి

ఎన్‌పీకుంట: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవరచుకోవాలని గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ సూచించారు. మంగళవారం తిమ్మమ్మమర్రిమానులోని బీసీ బాలుర వసతి గృహంలో 88 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లను ఆమె చేతులమీదుగా పంపిణీ చేశారు. వార్డెన్ జయరామిరెడ్డి, డ్రాయింగ్ టీచర్ శ్రీనివాసులు, సీఆర్‌పీ రజని తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి



కొవ్వొత్తుల ప్రదర్శన దృశ్యం

నల్లమాడ: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, జిల్లా బాలల పరిరక్షణ సమితి కౌన్సిలర్ శివలత పేర్కొన్నారు. పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు బాలలకు ఉంటుందన్నారు. వాటికి ఎవరు భంగం కలిగించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బాలలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే 1098కి ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మహిళా శిశు కార్యదర్శి నాగరత్నమ్మ పాల్గొన్నారు.

సంక్షేమం.. ప్రశ్నార్థకం

- హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు మృగ్యం
- తాగునీటి సమస్యకూ కటకటలే
- ఫ్యాన్లు తిరగవు.. దోమలు ఆగవు
- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం
- ఆరుబయట స్నానాలతోనే సరి



తాడిమర్రి బీసీ హాస్టల్లో నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

పుట్టపర్తి/ముదిగుబ్బ/తాడిమర్రి/గాండ్లపెంట/కదిరి అర్బన్/ బత్తలపల్లి/ తలుపుల: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమం ప్రశ్నార్థకంగా మారింది. మౌలిక సదుపాయాలు మృగ్యమయ్యాయి. ప్రహరీలు లేక విషపురుగుల సంచారంతో భయంభయంగా గడుపుతున్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో ఇబ్బందుల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు.

- పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓడీ చెరువు బీసీ హాస్టల్‌లో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ లేక మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. హాస్టల్ ముందు మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు ఎక్కువయ్యాయి. ఇక పుట్టపర్తి హాస్టల్ వెనుక మురుగునీరు నిలిచి దోమల బెడద ఎక్కువై విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారు. నల్లమాడ, కొత్తచెరువు, అమడగూరు మండలాల్లోని వసతి గృహాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- ముదిగుబ్బ మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహంలో నీటి వసతి లేదు. హాస్టల్ ప్రాంగణం ముళ్లపొదలు విస్తరించి విషపురుగులకు ఆవాసంగా మారింది. దీనికితోడు సమీపంలోనే విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక ఎనుములవారిపల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు నిద్రించడానికి అనువైన గదులు లేవు. బాత్‌రూంలు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. తాగునీటి కోసమూ ఇబ్బదులూ తప్పడం లేదు.
- తాడిమర్రిలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థుల చేరికలు లేకపోవడంతో ఎస్సీ బాలుర వసతి గృహం మూతపడింది. మరో బీసీ బాలుర వసతిగృహం 16 మంది విద్యార్థులకే పరిమితమైంది. మరుగుదొడ్లు, డార్మిటరీ, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కేజీబీవీకి ప్రహరీ లేకపోవడం, ఊరికి దూరంగా ఉండటంతో విద్యార్థులు రాత్రివేళ భయాందోళన చెందుతున్నారు.
- గాండ్లపెంటలోని బీసీ బాలుర వసతి గృహం కిటికీలకు అమర్చిన మెష్‌లు రంధ్రాలు పడటంతో దోమలు మోత మోగిస్తున్నాయి. గదుల్లో ఫ్యాన్‌లు ఉన్నా పని చేయడం లేదు.
- కదిరి పట్టణం వీవర్స్ కాలనీలోని బీసీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. డైనింగ్ హాలు లేకపోవడంతో వరండాలోనే విద్యార్థులు భోజనం చేస్తున్నారు. 160 మంది విద్యార్థులకు గాను గదులు నాలుగు, మరుగుదొడ్లు నాలుగు మాత్రమే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- తలుపులలోని బీసీ హాస్టల్ విద్యుత్ వైరింగ్ దెబ్బతింది. ఫ్యాన్లు, లైట్లు లేవు. ప్రత్యేకంగా బోరు లేకపోవడంతో పంచాయతీ నీటిపైనే ఆధారపడి అవసరాలు తీర్చుకుంటున్నారు.
- బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. 363 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపడ మరుగుదొడ్లు, బాత్రూంలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భోజనాలు తినేందుకు షెడ్డు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. గదుల్లో కిటికీలకు మెష్ లేకపోవడం వల్ల దోమలు మోత మోగిస్తున్నాయని చెబుతున్నారు.

బాత్రూంలకు డోర్లు లేవు



జ్యోతిబా పూలే బాలుగర గురుకుల పాఠశాలలో బాత్రూములకు డోర్లు లేవు. స్నానాలు చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. 363 మంది విద్యార్థులు స్నానాలు చేయాలంటే తీవ్ర అసౌకర్యంగా ఉంది. తరగతులకు ఆలస్యం అవుతుందని ఆరు బయటే స్నానాలు చేసి క్లాసులకు వెళ్తున్నాం.

– అనిల్, పదవ తరగతి విద్యార్థి, బత్తలపల్లి.

కిటికీలకు మెష్ కొట్టించాలి



గదుల్లో కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలి. కిటికీలకు డోర్లు లేకపోవడం, మెష్ లేకపోవడం వల్ల దోమలు కుడుతున్నాయి. వాటి బారి నుంచి రక్షించుకునేందుకు వేసవి కాలంలో బెడ్ షీట్లు కప్పుకుంటే ఉక్కపోత.. కప్పుకోకుంటే దోమలు మోత భరించలేకపోతున్నాం.

– చరణ్, పదవ తరగతి విద్యార్థి, జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల, బత్తలపల్లి



ముదిగుబ్బలోని బీసీ బాలికల వసతి గృహం



కదిరి బీసీ హాస్టల్‌లో తలుపులు లేని గది



ఓడీ చెరువు బీసీ హాస్టల్ ముందు నిలిచిన మురుగునీరు



గాండ్లపెంట బీసీ బాలుర వసతి గృహం కిటికీ మెష్ దుస్థితి

ఆధార్ క్యాంపులు ప్రారంభం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి సచివాలయం, వెంగళమ్మచెరువు ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఆధార్ క్యాంపులు ప్రారంభించారు. ఈ కేంద్రాలు ఈ నెల 25 వరకూ కొనసాగించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు అపార్ కోసం ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకునేందుకు ఈ క్యాంపులు ఉపయోగపడతాయన్నారు. పెడపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో 20వ తేదీన కొట్లపల్లి, రాచువారిపల్లి, 21న ఇరగరాజుపల్లి, దిగువచెర్లోపల్లి, 22న వెంకటగారిపల్లి, పైపల్లి, జగరాజుపల్లి, కప్పలబండ, 25వ తేదీన నిడిమామిడి పంచాయతీల వారు వినియోగించుకోవచ్చన్నారు. వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాలలోని ఆధార్ కేంద్రంలో ఈ నెల 20న చెర్లోపల్లి, 21న అమగొండపాళ్యం, బొంతలపల్లి, 22న ఆయా పంచాయతీల్లో మిగిలిన విద్యార్థులు చేయించుకోవాలని సూచించారు. దండోరా వేయించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు ఎంఈఓ ప్రసాద్, సెక్రెటరీలు గోపాల్‌రెడ్డి, గోవర్ధన్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంకష్టహర చతుర్థి



కదిరి టౌన్: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అనుబంధ ఉమామహేశ్వర ఆలయంలో వినాయకునికి (గణపతికి) మంగళవారం సంకష్టహర చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంకష్టహర చతుర్థి వ్రతాన్ని ఆచరించడం వల్ల అష్టైశ్వర్యాలు, శుభలాభాలు పొందుతారని అర్చకులు విజయస్వామి తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కదిరి అర్బన్: మున్సిపల్‌పరిధిలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఆర్డీఓ వెంకటసన్యాసి శర్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం కాళసముద్రం గ్రామసభలో పాల్గొన్నారు. మార్గమధ్యలో స్టాక్ పాయింట్ గోడౌన్ పరిశీలించారు.

జాతీయస్థాయి పోటీలకు యామిని

ధర్మవరం రూరల్: చిగిచెర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని యామిని జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే అండర్–17 ఏపీ జట్టుకు ఎంపికైనట్లు పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. యామినిని హెచ్‌ఎం తిమ్మారెడ్డి అభినందించారు.

అనధికార లేఅవుట్ల తొలగింపు

ఎన్‌పీకుంట: తహసీల్దార్ కార్యాలయ సమీపాన నల్లగంగమ్మ గుడి వద్ద అక్రమంగా వేసిన లేఅవుట్లను ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి రెడ్డిభాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. నోటీసులు ఇచ్చినా నిర్లక్ష్యం చేయడంతో హద్దురాళ్లు తీసేసినట్లు చెప్పారు.

బాలల హక్కులపై అవగాహన

తనకల్లు: మండలంలోని సీజీ ప్రాజెక్టు గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. రాజ్యాంగంలో బాలలకు ప్రత్యేకంగా కొన్ని చట్టాలు, బాధ్యతలను రూపొందించారన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నల్లచెరువు: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర సూచించారు. మంగళవారం ఉప్పార్లపల్లిలో ఎస్‌ఐ మక్బూల్‌బాషాతో కలిసి సీఐ పర్యటించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ధర్మవరం అర్బన్: బొమ్మనహాళ్ మండలం చంద్రగిరికి చెందిన ఆర్యవైశ్యుడు కృష్ణమూర్తిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దూపుకుంట్ల శబరి వరప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ధర్మవరంలోని ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కలవల రామ్‌కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 24న అనంతపురంలో జరిగే ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ ఆస్తి వివాదంలో కృష్ణమూర్తిని కిరాతకంగా హత్య చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం పొలిటికల్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు కలవల నాగతేజ, మీడియా కమిటీ సభ్యులు గ్రంధే శ్రీనివాసులు, నాయకులు అంబటి అవినాష్, మురళి, రెడ్డి వంశీరాం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న శబరి వరప్రసాద్

మహిళలకు స్ఫూర్తి ఇందిరాగాంధీ

చెన్నేకొత్తపల్లి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళలకు స్ఫూర్తి అని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు మేడాపురం గ్రంథాలయంలో మంగళవారం ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు.

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పుట్టపర్తిలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారి జయసింహరాజు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

కదిరిటౌన్: పట్టణంలోని ఇందిరాగాంధీ సర్కిల్‌లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.



ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

గాండ్లపెంట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు గ్రంథాలయాధికారి ఫరియాబాను నిర్వహించిన రంగవల్లులు, చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా సాగాయి.

సంక్షిప్త సమాచారం

టిప్పర్ పట్టివేత

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

కదిరి అర్బన్: రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో ఉద్యోగాలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలో ఆరు నెలలు రెసిడెన్షియల్ డేస్కాలర్ విధానంలో శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులు కాషన్ డిపాజిట్ రూ.75 వేలు చెల్లించాలన్నారు. జర్మనీలో ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 93901 76421 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వీఆర్‌కు సీఐ మోహన్

కదిరి అర్బన్: కదిరి రూరల్ అప్‌గ్రేడ్‌పోలీస్ స్టేషన్ సీఐ మోహన్‌ను మంగళవారం పోలీసు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వీఆర్‌కు అయనను బదిలీ చేశారు. నంద్యాల సీసీఎస్‌లో సీఐగా పని చేస్తున్న నిరంజన్‌రెడ్డిని కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్‌కు బదిలీ చేశారు. నిరంజన్‌రెడ్డి గతంలో కూడా ఇక్కడ సీఐగా పనిచేశారు.

కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం

ధర్మవరం రూరల్: ధర్మవరం, దర్శనమలలో కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకుడు అమ్మెంబాల్ సుబ్బారావు పాయె చిత్ర పటానికి సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రికార్డులు లేకుంటే వాహనాలు సీజ్ చేస్తాం

ధర్మవరం రూరల్: వాహనదారుల వద్ద రికార్డులు లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం కామిరెడ్డిపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ సూచించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ధర్మవరం రూరల్: కట్టకిందపల్లి వద్ద మంగళవారం అభయాంజనేయ స్వామి సన్నిధిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

టమాట పంటకు ప్రీమియం చెల్లించండి

బత్తలపల్లి/ తాడిమర్రి: ఉద్యాన పంటల బీమా పరిధిలోకి టమాటను చేర్చినందున రైతులు ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ అధికారి అమరేశ్వరి మంగళవారం కోరారు. టమాట పంటకు ఎకరాకు గరిష్ఠంగా రూ.32,000 బీమా పరిహారం అందుతుందన్నారు. ఇందులో ప్రీమియం పది శాతం అంటే రూ.3,200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.800 చొప్పున రూ.1,600 చెల్లిస్తే, మిగిలిన రూ.1,600 రైతు వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ఓడీచెరువు : మండలకేంద్రం సమీపంలో శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం అమడగూరుకు చెందిన మాతృశ్రీ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి సహకారంతో మాలధారులకు అన్నదానం చేసినట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు. అయ్యప్పలకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు అరుణజ్యోతి తెలిపారు

మహిళలు అన్నింటా రాణించాలి

బత్తలపల్లి: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని గ్రంథాలయ అధికారి రాజేశ్వరి పిలుపునిచ్చారు. బత్తలపల్లిలోని శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ జయంతి, మహిళా సాధికారిత అంశాలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు.

ఉరుసే షరీఫ్ ఉత్సవాలు ప్రారంభం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట వద్ద 98వ ఉరుసే షరీఫ్ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఎద్దులబండిలో ప్రత్యేకంగా అలంకరించిన ఉరుసే షరీఫ్‌ను పురవీధుల్లో డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం దర్గాకు చేరుకుని గంధంను మజారే షరీఫ్‌పై ఎక్కించారు. రాత్రి ఖవ్వాలీ నిర్వహించారు.

ఉద్యోగాలకు 23 మంది ఎంపిక

పుట్టపర్తి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. 54 మంది యువతీ యువకులు హాజరయ్యారు. మూడు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేసి వారిలో 23 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ మక్బుల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు.

కంటింజెంట్ ఆయాలకు వేతనాలు పెంచండి

ధర్మవరం: ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న కంటింజెంట్ ఆయాల వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిరసన తెలిపిన అనంతరం చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మికి నాయకులు, కార్మికులు వినతిపత్రం అందించారు.

సర్వేయర్‌పై విచారణ

ముదిగుబ్బ: గుడ్డంపల్లి తండా సర్వేయర్ రాజేష్‌పై మంగళవారం ఏడీ విజయశాంతిబాయి విచారణ చేపట్టారు. గుంజేపల్లి పొలానికి సంబంధించిన రైతు విశ్వనాథ్, వీరనారప్పలు గ్రీవెన్స్‌లో సర్వేయర్ రాజేష్‌పై ఫిర్యాదు చేశారు. తమ పొలానికి చెందిన స్కెచ్ ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం ఏడీ మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఫిర్యాదు చేసిన రైతులతో పాటు సంబంధిత సర్వేయర్‌ను విచారణ చేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నం చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన బధిర (మూగ, చెవుడు) మహిళ రేణుక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. కాసేపటికి అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు గమనించి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇక కేతిరెడ్డి కాలనీకి చెందిన గంగాదేవి భర్తతో గొడవపడి మనస్తాపం చెంది విషద్రావకం తాగింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సమావేశం

ముదిగుబ్బ: గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం మంగళవారం కొండగట్టుపల్లి సచివాలయంలో రైతులతో ఆర్డీఓ మహేష్ సమావేశం నిర్వహించారు. హైవేకు ఎంత మేర భూములు కావాలి, ఎంత మేర సేకరించాలి అనే విషయాలపై రైతులతో చర్చించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

ముదిగుబ్బ: ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం అభయాంజనేయస్వామి, గణపతి, షిర్డీసాయి బాబా విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. నీలకంఠేశ్వర రెడ్డి, పొన్నూరు నాగేంద్రరెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

వైద్యం కోసం ఆర్థికసాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన విద్యార్థి సమీర్ హాకీ క్రీడలకు వెళ్లి ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు బలమైన గాయం తగలడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న ఎంఎండీఏ జిల్లా అధ్యక్షుడు రోషన్ జమీర్ మంగళవారం తన వంతుగా విద్యార్థి వైద్యానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

పుస్తక పఠనంతో సంపూర్ణ విజ్ఞానం

తాడిమర్రి: తరచుగా పుస్తక పఠనం చేయడంతో సంపూర్ణ విజ్ఞానం లభిస్తుందని ఎంపీడీఓ వెంకట రంగారావు పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారి డి.శీనానాయక్ ఆధ్వర్యంలో తాడిమర్రిలోని కేజీబీవీలో మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ఎంపీడీఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

విగ్రహపోతకు భక్తులు సహకరించాలి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో డిసెంబర్ 6న భక్తుల ఎదుటే అయ్యప్పస్వామి విగ్రహ పోత కార్యక్రమం నిర్వహించనున్నామని దేవాలయ ట్రస్ట్ గురుస్వామి పీజే విజయకుమార్ తెలిపారు. విగ్రహం పోతలో పంచలోహ విగ్రహం తయారీకి దాతలు, భక్తుల నుంచి బంగారు, వెండి, నగదు విరాళాలు అందించాలని తెలిపారు.

కబడ్డీ సౌత్‌జోన్ పోటీలకు ధరణి

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి వద్దనున్న మంగళకర డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ధరణి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ఎస్కేయూనివర్సిటీ తరఫున ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థినిని కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్య ప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్, పీడీ శ్రీనివాసులు మంగళవారం అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ముదిగుబ్బ: ముదిగుబ్బ ఎంపీపీ పాఠశాలలో గ్రంథాలయ అధికారి మూడే బొజ్జేనాయక్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు రామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షబ్బీర్, పీరే నాయక్, ఖాదర్‌బాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదులో ఇబ్బంది పెట్టొద్దు

తలుపుల : అపార్ నమోదులో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా ఆధార్ అప్‌డేట్ చేయాలని ఎంపీడీఓ రామానాయక్, జీఎస్‌బీవీ డిపార్ట్‌మెంట్ వారికి సూచించారు. స్థానిక కేజీబీవీలో జీఎస్‌బీవీ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన అపార్ నమోదు ప్రక్రియను మంగళవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు.